యూజీసీ చైర్మన్‌ను కలిసిన వీసీ జానయ్య

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 20 : న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డా. జానయ్య బుధవారం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) డా. జగదీశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు . జాతీయ విద్యావిధానం , ఆవశ్యకత అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. క్యాంపస్‌లో నూతనంగా నిర్మిస్తున్న బాలికల వసతి గృహ నిర్మాణానికి తనవంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు. డిసెంబర్‌లో జరగనున్న విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలకు హాజర్ కావాలని కోరగా , తాను సానుకూలంగా స్పందించినట్లు జానయ్య తెలిపారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి భూమిపూజ

బంజారాహిల్స్, నవంబర్ 20: ఫిలింనగర్ సమీపంలోని వినాయక్‌నగర్ పర్వతాంజనేయస్వామి ఆలయం ఆవరణలో నూతనంగా నిర్మించను న్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వా మి ఆలయ పనులకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బుధవారం భూమి పూజ నిర్వహించారు. సుదీర్ఘ కాలంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం కోసం స్థానికులు కోరుతున్నారని, అద్భుతమైన రీతిలో ఆలయాన్ని నిర్మించేలా తనవంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరేశ్‌చారి, లింగాచారి, విష్ణు, శాంతికుమార్, రవిరాజా, తిరుపతయ్య, రవిందర్‌చారి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు విద్యను దూరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర

- జేఎన్‌ఏఎఫ్‌ఏయూకు వర్సిటీ స్థలం కేటాయించవద్దు
- డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఉద్యోగుల జేఏసీ నేతలు

బంజారాహిల్స్, నవంబర్ 20: పేదలకు ఉన్నత విద్యను దూరం చేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తున్నట్లు అనుమానాలు కలుగుతున్నాయని డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉద్యోగుల జేఏసీ నేతలు ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల స్థలాన్ని జేఎన్‌ఏఎఫ్‌ఏయూకు కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉద్యోగులు సంతకాల సేకరణ చేపట్టారు. లక్షలాది మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఓపెన్ విధానంలో ఉన్నత విద్యను అందిస్తున్న డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని దెబ్బతీసే కుట్రలు జరుగుతుండడం ఆందోళనకరమని అంబేద్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి చైర్ పర్సన్ ప్రొ.పల్లవి కాబ్డే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఈనెల 27న వంటా వార్పు కార్యక్రమం చేపట్టనున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రొ.ఆనంద్ పవార్, ప్రొ.ఎల్వీకే.రెడ్డి, డా.యాకేశ్ దైద. డా. ఉదయిని, డా. నరసింహులు, శివమ్మ, కాంతం ప్రేమ్‌కుమార్, షబ్బీర్, పాండు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

డా. బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆవరణలో సంతకాల సేకరణ చేస్తున్న ఉద్యోగులు

కంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రాజేంద్రనగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బండ్లగూడ, నవంబర్ 20: స్వీయ జాగ్రత్తలతో కంటి సమస్యలు రాకుండా చూసుకోవచ్చని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ పేర్కొన్నారు. బుధవారం హోలిక్రాస్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో మ్యాక్స్‌విజన్ ఐ ఆస్పత్రి సహకారంతో రాజేంద్రనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో సెల్‌ఫోన్, కంప్యూటర్ వాడకం ఎక్కువైందన్నారు. దీంతో అనేక మంది కంటి సంబంధిత ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏదైన కంటి సమస్య వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. అనంతరం హోలీ క్రాస్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్య, వైద్య పరమైన సహాయ సహకారాలు తమ సంస్థ తరపున అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అలీ పాల్గొన్నారు.

బీసీఏ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 20: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీసీఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ (సీబీసీఎస్) మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్టు పేర్కొన్నారు.

'కాలుష్యం వెదజల్లె కంపెనీపై చర్యలు తీసుకుంటాం'

శంషాబాద్ రూరల్, నవంబర్ 20 : కాలుష్యం వెదజల్లె కంపెనీపై చర్యలు తీసుకుంటామని నర్కూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి వజ్రలింగం తెలిపారు. శంషాబాద్ మండ లం, నర్కూడ గ్రామంలోని స్వగృహ వెంచర్‌లో ఎలాంటి అనుమతి లేకుం డా పైబర్ కంపెనీ నిర్వహిస్తున్నారు. దీని ద్వారా వచ్చే కాలుష్యంతో పశువులు మృతి చెందుతున్నాయని, అలాగే భూగర్భజలాలు పూర్తిగా కాలుషితమవుతున్నాయని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకుపోవడంతో ఆయన బుధవారం కంపెనీ వద్ద కు వెళ్లి పరిశీలించారు. కాలుష్యం వెదజల్లె కంపెనీలకు ఎలాంటి అనుమతిలేదని, దీనిపై అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కంపెనీని పరిశీలిస్తన్న కార్యదర్శి వజ్రలింగం

సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్

పంజాగుట్టలో పర్యటించి వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

బంజారాహిల్స్,నవంబర్ 20: వెంకటేశ్వరకాలనీ డివిజన్, పంజాగుట్టలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి బుధవారం పర్యటించారు. స్థానిక జూబ్లీ మెడికల్ హాల్, ఫ్లీల్వాలా స్వీట్స్ ప్రాంతాల్లో సీవరేజ్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో అక్కడ కార్పొరేటర్ , జలమండలి మేనేజర్ శివకుమార్‌లు పర్యటించి.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల కొత్త పుట్‌పాత్ వేయడంతో రోడ్డుపై మురుగునీరు నిలిచిపోతున్నదని స్థానికులు వారి దృష్టికి తీసుకువచ్చారు. జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు.



యూసుఫ్‌గూడ సర్కిల్‌లో సర్వే చేస్తున్న సిబ్బంది

కొనసాగుతున్న సమగ్ర సర్వే..

జూబ్లీహిల్స్, నవంబర్ 20 : యూసుఫ్‌గూడ సర్కిల్‌లో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతున్నది. ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ వివరాలు సేకరిస్తున్నారు. సర్వే సిబ్బంది ఇప్పటికే స్టిక్కర్లు వేసిన గృహాలకు వెళ్లి కుటుంబ సభ్యుల సమాచారాన్ని పక్కాగా నమోదు చేస్తున్నారు. జీహెచ్ఎంసీ 19 సర్కిల్‌లోని 5 డివిజన్‌లలో సంబంధిత వార్డు అధికారుల ఆధ్వర్యంలో సర్వే సిబ్బంది స్టిక్కర్ వేసిన ప్రతి ఇంటిని సందర్శిస్తున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో బుధవారం జీహెచ్ఎంసీ చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్, అబ్జర్వర్ వెంకట్ రెడ్డి .. ఈఈ రాజ్ కుమార్, ఏఎంసీ కమల్‌తో కలిసి కుటుంబ సర్వేను పరిశీలించారు. సర్వే పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. డీసీ జాకియా సుల్తానా ఆధ్వర్యంలో జోనల్ నోడల్ ఆఫీసర్, యూబీడీ డీడీ అనిల్ కుమార్, సర్కిల్ నోడల్ ఆఫీసర్ వెంకటకిషన్ రావు సర్వేను పర్యవేక్షిస్తున్నారు.

సహకరించాలి..

అన్ని వర్గాల అభివృద్ధి కోసం చేపడుతున్న సమగ్ర సర్వేకు అందరూ సహకరించాలని రహ్మత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బ్రహ్మశంకర్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో సమగ్ర కుటుంబ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ బాలరాజ్, సూపర్‌వైజర్ హరిప్రసాద్, టీచర్ రామ్‌కుమార్, ఇతర ఉపాధ్యాయులు, ఎన్యుమరేటర్లు, స్థానిక బస్తీల ప్రతినిధులు పాల్గొన్నారు.

– జూబ్లీహిల్స్,నవంబర్ 20

వేగవంతంగా పూర్తి చేయండి..

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 20: ఇంటింటి సమగ్ర సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ సూచించారు. బుధవారం అత్తాపూర్ డివిజన్‌లో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లతో ఆయన సమావేశమైయ్యారు. సర్వేలో వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది ఇంటింటికి వెళ్లి సమగ్ర సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రజలకు అవగాహన పెంచుతూ వారి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. నిర్మల తదితరులున్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి..

రోడు భద్రత అవగాహన ప్రచారంలో భాగంగా ట్రాఫిక్ సౌత్ ఈస్ట్ జోన్ పోలీసులు ఐసీఐసీఐ లాంబర్డ్, ట్రాక్సె ఎస్ సొసైటీ సహకారంతో బండ్లగూడ పీఎస్ పరిధిలోని ఓఎస్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం రోడ్ సేఫ్టీ క్యాంపెయినింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా నగర అదనపు పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) పి.విశ్వప్రసాద్, ట్రాక్స్ ఎస్ సొసైటీ ప్రాజెక్ట్ హెడ్ అనురాధ జైన్, ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజేశ్ నీమ్‌కర్‌లతో కలిసి పోలీసులు.. వారి పిల్లలకు హెల్‌మెట్లను పంపిణీ చేశారు. అనంతరం అదనపు సీపీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ ..ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురైనప్పుడు తలకు గాయం కాకుండా హెల్మెట్ రక్షణ కల్పిస్తుందన్నారు. హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను రక్షించించుకోవాలని సూచించారు. అనంతరం చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పీఎస్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి హెల్మెట్ ధరించని వారిపై 60కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ వి.చంద్రకుమార్, ట్రాఫిక్ సీఐ జె.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

– సిటీబ్యూరో, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ)

స్వాగతతోరణ నిర్మాణానికి శంకుస్థాపన

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ గ్రామం, దుర్గానగర్ కాలనీలో స్వాగత తోరణ దిమ్మెలకు బుధవారం గ్రామ నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, రాజ్‌కుమార్, తదితరుల ఆధ్వర్యంలో శంకుస్థాపన పనులు ప్రారంభించారు. దుర్గానగర్‌కు గుర్తింపు చిహ్నంగా ఈ స్వాగత తోరణాన్ని కాంక్రీట్‌తో నిర్మించి అందుబాటులోకి తీసుకురానున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు. – మణికొండ, నవంబర్ 20

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదం చేస్తాయని నారాయణ పాఠశాలల తెలంగాణ జీఎం గోపాల్‌రెడ్డి అన్నారు . సనత్‌నగర్ క్రీడా ప్రాంగణంలో బుధవారం జరిగిన నారాయణ ఎస్ఆర్‌నగర్ జోనల్ స్థాయి క్రీడలకు సనత్‌నగర్ కార్పొరేటర్ లక్ష్మీబాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ పోటీల్లో అత్తాపూర్ నారాయణ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ క్రీడోత్సవంలో ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి , ప్రిన్సిపాల్ మధుమతి, కోఆర్డినేటర్స్ చంద్రశేఖర్, ఫర్జాన, రష్మిక, ఏవో సుదర్శన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 20

బాధ్యతల స్వీకరణ..

రాజేంద్రనగర్‌లోని వాటర్, ల్యాండ్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ , రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(వాలంతరీ) సంస్థ డైరెక్టర్ ఆఫ్ జనరల్‌గా ఎం.అనిత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగులు ఈఈ నాగేందర్, గణేశ్వర్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, నాగేశ్వర్ రావు, డైరెక్టర్ విజయ గౌరి, ఫంకజాదేవి, జాన్సీ తదితరులు స్వాగతించి, సత్కరించారు. – వ్యవసాయ యూనివర్సిటీ

టీడీపీ పూర్వ వైభవానికి కృషి చేయాలి

బండ్లగూడ, నవంబర్ 20: తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు, రాష్ట్ర సమన్వయ కర్త రామ్మోహన్‌రావు, టీటీడీ దేవస్థానం సభ్యులు నన్నూరి నర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సామ భూపాల్‌రెడ్డి గార్డెన్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్‌రెడ్డి, నాయకులు రాఘవులు, దుర్గాప్రసాద్, షకీలారెడ్డి, విజయ, కృష్ణ, సరాజుద్దీన్, మోహనరావు, రాసూరి బాలప్ప , మాణిక్యం, మల్లికార్జున్‌యాదవ్, క్రిష్ణాగౌడ్, జీపీఎల్ డైరెక్టర్ రావు, జీఎం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

ఖైరతాబాద్, నవంబర్ 20 : వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఖైరతాబాద్ పోలీసుల కథనం ప్రకారం.... హోటల్ తాజ్ కృష్ణ రోడ్‌లోని భాను విల్లాలోని ఓ ఫ్లాట్‌లో గండ్ర నర్సింహులు, ధరణికోట భూరమ్మ అలియాస్ రూటమ్మ కొంత కా లంగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి యువతులను తీసుకువచ్చి విటులను ఆకర్షిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు సదరు గృహంపై దాడి చేయగా, నిందితులిద్దరితో పాటు విటుడు రామంతాపూర్‌కు చెందిన సంగా సందీప్‌ను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి రూ.2వేల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

మత్స్యకారులకు రక్షణ చట్టం తీసుకురావాలి..

మన ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్

హిమాయత్‌నగర్, నవంబర్ 20: రాష్ట్రంలోని మత్స్యకారులకు రక్షణ చట్టం తీసుకురావాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్స్య రంగంలో దళారీ వ్యవస్థను అరికట్టి మత్స్యకారులే మార్కెటింగ్ చేసుకునే అవకాశం కల్పించి, యాభై ఏండ్లు నిండిన మత్స్య కారులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నం.6ను అమలు చేయడంతోపాటు కొత్త సొసైటీలను ఏర్పాటు చేసి 18 ఏండ్లు నిండిన మత్స్య కారులకు సభ్యత్వాలు కల్పించాలన్నారు. మత్స్య రంగంలో ఏండ్లతరబడి పనిచేస్తూ సేవలు అందిస్తున్న మత్స్యకారుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులను సత్కరిస్తామని తెలిపారు. ఈ వేడుకలకు ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వాకిడి శ్రీహరి, టీఎండీసీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, నీలం మధు ముదిరాజ్ హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శివయ్య ముదిరాజ్, మద్దెల సంతోష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పగిడాల సుధాకర్, గొడుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

హైదర్‌గూడలోని మహాసభ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ ముదిరాజ్

ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలి

వైద్య శిబిరం ప్రారంభంలో ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి

మణికొండ, నవంబర్ 20: తమ ఆరోగ్యాలపై శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మహాత్మా గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. ఎంజీఐటీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం లయన్స్ క్లబ్ జూబ్లీహిల్స్, అపోలో ఆసుపత్రి కొండాపూర్ వారి సహకారంతో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరైయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయించారు. ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యం అని అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ఆరోగ్య సూత్రాలు పాటించాలని, ప్రతి ఉదయం నడక ఆరోగ్యానికి మంచిదన్నారు. ఆరోగ్య శిబిరంలో దాదాపు 500 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి దంత వైద్యులు డాక్టర్ శివనాగిని, డాక్టర్ పి.అను"e, రెజెనీ ఆర్థో స్పోర్ట్స్ వైద్యులు డాక్టర్ అశ్విత, అమెరికన్ లెజర్ ఐ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్ ఆజాద్, లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ విజయలక్ష్మి, లయన్ అరుణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి.బాల్‌రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్

వారంరోజులుగా శంషాబాద్ పట్టణంలోని మధురానగర్ స్ట్రీట్ నం.14లో గుర్తు తెలియని వృద్ధురాలు చలికి వణుకుతూ తిండిలేక ఇబ్బందులు పడుతున్నది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి.. బుధవారం ఆ వృద్ధురాలిని మెరియా సాధన్ ఆశ్రమానికి తరలించడానికి యత్నించగా.. ఆరోగ్యం బాగలేకపోవడంతో 108 లో ఉస్మానియా దవాఖానకు తరలించారు. – శంషాబాద్ రూరల్

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

హిమాయత్‌నగర్ : ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి ఎంతో ఉప యోగపడుతుందని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బుధవారం ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ .. అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చొరవ తీసుకుంటానని చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న క్రీడలు..

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 20: క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులే.. చదువులోనూ రాణిస్తున్నారని ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ కళాశాల అసోసియేట్ డీన్ , డా. నరేందర్ రెడ్డి అన్నారు. అంతర్ కళాశాల క్రీడల్లో భాగంగా రెండవ రోజు బుధవారం వర్సిటీ పరిధిలోని క్రీడా మైదానంలో క్రీడలు ఉత్సాహంగా కొనసాగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చురుకుగా తనకు ఆసక్తి గల క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల మధ్య స్నేహభావం ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. చక్కని ప్రతిభను కనబర్చిన విద్యార్థులు జాతీయ పోటీలకు ఎంపిక అయ్యే అవకాశం ఉందన్నారు. విద్యార్థి ప్రతిభ ,సృజనాత్మకతను కనబర్చేందుకు ఇది మంచి అవకాశమని యూనివర్సిటీ అబ్జర్వర్, ఫిజికల్ డిపార్టుమెంట్ హెడ్ డా.సురేశ్ అన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గల 11 కళాశాలల నుంచి విద్యార్థినీ విద్యార్థులు దాదాపు 460 మంది పాల్గొన్నారు. క్రీడలు రెండవ రోజు సాయంత్రం ముగిసే సరికి వాలీబాల్ రాజేంద్రనగర్, పుట్‌బాల్ అశ్వరావుపేట, టెన్నికాయిట్ జగిత్యాల జట్లు సెమీ ఫైనల్‌కు చేరినట్లు ఫిజికల్ డిపార్టుమెంట్ హెడ్ డా.సురేశ్ తెలిపారు.

వాలీబాల్ ఆడుతున్న విద్యార్థినులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ, నవంబర్ 20 : గంధంగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారి ఏఈ అమర్‌సింగ్ తెలిపారు. ఇండస్‌వ్యాలీ, సంజయగాంధీనగర్, భవానీ కాలనీ, బైరాగీగూడ, శివాసాయినగర్, సుబ్రమణ్యం కాలనీ, రంగారెడ్డి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, వాల్మీకి ఆశ్రమం, శివపురి కాలనీ, గంధంగూడ, భవానీ కాలనీల్లో, అలాగే..మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు సాయి హర్షకాలనీ, సాయిరాంనగర్ కాలనీ, సాయిరాంఎన్‌క్లేవ్, సౌభాగ్య నగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ప్రశాసన్‌నగర్ పరిధిలో..

జూబ్లీహిల్స్ : విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర నిర్వహణ పనుల కారణంగా గురువారం వివిధ 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బంజారాహిల్స్ సీబీడీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రశాసన్ నగర్ సబ్‌స్టేషన్ నందగిరి హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.. జర్నలిస్ట్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కృష్ణానగర్ సబ్‌స్టేషన్ గ్రీన్ బావర్చి ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.. కమాండెంట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సీబీడీ ఏడీఈ గోపి పేర్కొన్నారు.

మధుమేహంపై అవగాహన

జూబ్లీహిల్స్, నవంబర్ 20 :క్రమమైన జీవనశైలితో డయాబెటిస్‌కు చెక్ పెట్టవచ్చని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దీప్తిశ్రీ పేర్కొన్నారు. ప్రపంచ మధుమేహ వారోత్సవాల సందర్భంగా బుధవారం శ్రీరాంనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డయాబెటిస్ వ్యాధి రకాలు, లక్షణాలు, కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ విజయనిర్మల ,వైద్య సిబ్బ